క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ సభ్యుడిగా ఉరుకూటి



గాజువాక: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉరుకూటి అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పారావుకు రాష్ట్రస్థాయి పదవి లభించడంపై స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

పసుపు, కుంకుమల పంపిణీ



పసుపు కుంకుమలు పంపిణీ చేస్తున్న రామారావు, కనక భవానీ

అగనంపూడి: విజయదశమి, జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని 79వ వార్డు అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సమితి చైర్మన్ చిత్తా రామారావు సహకారంతో బొర్రమాంబ పారాయణ సేవా సమితికి చెందిన 50 మంది గాజులు, పసుపు కుంకుమలు అందించారు. మహిళా సంఘం నాయకురాలు గొల్లవిల్లి కనక భవానీ, బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేషలు చేతుల మీదుగా వీటిని అందించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

మహనీయుడికి ఘన నివాళి



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: గాంధీ జయంతిని కణితిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భరత జాతి కీర్తిని ప్రపంచానికి తెలియచెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు ప్రగడ శ్రీను, వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద, దానప్పలు తదితరులు పాల్గొన్నారు. అలాగే లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్టీల్‌పాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అచ్యుతాపురందరి మడుతూరు గ్రామానికి చెందిన బి. అప్పలరాజు (40) స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 2న విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. సెక్టార్-9 సాయిబాబా గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అతని బైక్‌ను రాసుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో అతను బైక్‌ను ఎడమ వైపు మరలించగా అదే సమయంలో రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో అతన్ని ఢీకొంది. ఈ సంఘటనలో అప్పలరాజుకు గాయాలయ్యాయి. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారు, ఆటో యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద గాంధీజీ విగ్రహానికి డీఆర్ఎం లలిత్ బోహ్రా అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 15 వరకు వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం తెలిపారు. రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించిన రోజు స్వచ్ఛ భారత్- స్వచ్ఛ రైలు సాధ్యమని పేర్కొన్నారు. పలు క్లీనింగ్ పరికరాల పనితీరును డీఆర్ఎం స్వయంగా పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారాం(ఇన్‌ఫ్రా), ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరో మైలు రాయి దాటింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపు లభించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-2025 అవార్డు సాధించింది.రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. – పెదగంట్యాడ

స్వచ్ఛతలో మెరిసె.. అవార్డుతో మురిసె..



పచ్చని మొక్కల మధ్య పాఠశాల

నడుపూరు పాఠశాల మరో మైలురాయి
స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక



పాఠశాల ఆవరణలోబొప్పాయి మొక్కలు

పరిశుభ్రత కార్యక్రమాలు, ఆట స్థలాలు, తోటల సంరక్షణలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కృషి చేశారు. ఆరోగ్యాన్ని కాపాడే వాతావరణ సృష్టి, విద్యార్థుల్లో శుభ్రత పై అవగాహన కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చారు. అందరి సహకారంతో పాఠశాలకు అవార్డు దక్కింది. ఇది ఏ ఒక్కరికో చెందిన కాదని, అందరి భాగస్వామ్యంతో సాధించిన విజయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల కోసం..

పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక వసతులు ఉంటాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లు ఉన్నాయి. శానిటరీ నాప్‌కిన్స్ వినియోగంలో భాగంగా ఇన్సినేటర్ల వినియోగం, అలాగే విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా హ్యాండ్ వాష్ పాయింట్లు ఏర్పాటు చేశారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రా అవార్డును ఈ నెల6న సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందుకోనున్నారు.

అభినందనల వెల్లువ

స్వచ్ఛత అవార్డు సాధించడంతో సర్వ శిక్ష అధికారులు, విద్యాశాఖాధికారులు, స్థానిక రాజకీయ నాయకులు స్పందించి నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థాయి అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

నీటి నాణ్యతపై పరీక్షలు

నీటి నాణ్యతపై నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ల్యాబ్‌లో ప్రత్యేకంగా పరీక్షలు చేయిస్తున్నారు. మియావాకీ అడవులను మూడేళ్ల కిందటే ఈ పాఠశాలలో ఏర్పాటు చేశారు. వాటి సంరక్షణ కోసం చుట్టూ గ్రీన్ బెల్ట్ తయారు చేశారు.

నందన వనంలా...


నడుపూరు పాఠశాల నందన వనాన్ని తలపిస్తుంది. పచ్చని తోటలు, పండ్ల మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పరి శుభ్రమైన తరగతి గదులు, తాగునీటి వసతి, ప్లాస్టిక్ రహిత ప్రాంగణం రాష్ట్ర విద్యాశాఖ బృందాన్ని ఆకట్టుకున్నాయి. దీంతో రాష్ట్ర స్థాయి గౌరవం దక్కింది.

అవగాహన ర్యాలీలు

పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, ఓజోన్ పొర కాపాడే విషయంలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. అలాగే వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటి కారణంగా పాఠశాలకు అవార్డు తమ సొంతమైంది.



ఓజోన్ పొర రక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థులు (ఫైల్)



పరిశుభ్రంగా ఉన్న వాష్‌రూమ్స్

అరుదైన జాతి మొక్కల పెంపకం

పాఠశాలలో ఔషధ గుణాలు కలిగిన మారేడు, లెమెన్ గ్రాస్, నాగమల్లి, అరికేపం, రాయల్‌పాతో నాటు పలు ఆకుకూరలను పెంచుతున్నారు. పాఠశాల మొత్తం పచ్చదనం పరిడల్లే విధంగా మొక్కలను సంరక్షిస్తున్నారు. పాఠశాల నిర్వహణ కోసం సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



రాష్ట్రంలో మూడు పాఠశాలలు పురస్కారానికి ఎంపికయ్యాయి. అందులో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండడం చాలా సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల సాధించిన ఘనత. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్, సర్వ శిక్షాప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, ఉప విద్యా శాఖాధికారి సోమేశ్వరరావు, మండల విద్యా శాఖాధికారుల సహకారం మరువలేనిది.
–రాచకొండ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదగంట్యాడ

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు



దుర్గాదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం చేస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం



దిబ్బపాలెంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న పూర్ణ

పెదగంట్యాడ: దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఈ పండగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం దుర్గాదేవికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువు ఉమారామాలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ఘటాభిషేకాలు చేశారు. గురువారం ప్రత్యేకంగా శ్రీకృష్ణ తులాబారం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ శ్రీకృష్ణుడి పాత్ర పోషించి భక్తులను అలరించారు.

–జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బర్మాకాలనీలోని దుర్గాదేవి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని విశేష పూజలు చేశారు. శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామల్లేశ్వర స్వామి శాంతి కల్యాణం, భారీ అన్నసమారాధన నిర్వహించారు.

–హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ పంచాయతన దేవాలయంలో వాసవీమాతను రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శక్తి స్వరూపిణిని మనసారా కొలిచి తన్మయత్వం పొందారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు,బొండాడ వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశేష అలంకరణల్లో ముగ్గురమ్మలు


ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.ఆలయ ఆవరణలో వాహన పూజలు చేశారు. సాయంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో నవచండీయాగం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం జమ్మిపూజ చేశారు. మహాదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరిగా, మహాలక్ష్మి అమ్మవారు బంగారు వర్ణం చీరలో మహాలక్ష్మి దేవిగా, మహాసరస్వతి ఆకుపచ్చవర్ణం చీరలో వరదాయినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

అగనంపూడి: శరన్నవరాత్రుల సందర్భంగా దిబ్బపాలెంలో దుర్గమ్మను 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇల్లపు జువ్వాలు, యలమంచిలి అప్పారావు, ఈగల నరసింగరావు పాల్గొన్నారు. అలాగు అగనంపూడిలో దుర్గాలమ్మను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



రాజరాజేశ్వరిగామహాదుర్గ



వరదాయినిగా మహాసరస్వతి



మహాలక్ష్మిగా మహాలక్ష్మి

మహాత్మా గాంధీకి నివాళి

ఉక్కునగరం: జాతిపిత మహాత్మా గాంధీకి స్టీల్‌ప్లాంట్‌లో నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఈడీ (బిల్డింగ్) ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముడు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి, సీజీఎం ప్రవీణ్‌కుమార్, జీఎంలు డాక్టర్ జి. రమాదేవి, విభాగాధిపతులు దీపాంకర్ దాస్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

పెదగంట్యాడ: మహాత్మా గాంధీ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవవాలని నడుపూరు పైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చెంనాయుడు అన్నారు.జీవీఎంసీ 76వ నడుపూరు గాంధీపార్కులో పైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాపూజీ కలలు గన్న స్వరాజ్యం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొడ్డు కృష్ణ, ములగపాక ప్రసాద్, ఎండా ఆదినారాయణ, సీర చిన్నారావు, ములగపాక బాబురావు, పెంటబాబు, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గాంధీపార్కులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ అధ్యక్షుడు బెల్లాల పెంటబాబు, బెల్లాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శంకరనారాయణ తదితరులు



స్టీల్‌ప్లాంట్ ఈడీ బిల్డింగ్‌లో మహాత్మునికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్, ఉన్నతాధికారులు

సేవలతోనే గుర్తింపు



వెంకటరమణారెడ్డిని సత్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కులో సుదీర్ఘకాలం పని చేసి రిటైర్డ్ అయిన గొందేశి వెంకటరమణారెడ్డి శేష జీవితం హాయిగా సాగాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన రమణారెడ్డి వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు పొందిన వారు బాధ్యతగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ మన ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, కాకినాడ పెంటారావు పాల్గొన్నారు.

స్వచ్ఛకాలనీగా తిరుమలనగర్



అవార్డు పొందిన తిరుమలనగర్ చిత్రం



తిరుమలనగర్‌లో విశాలంగా, శుభ్రంగా ఉన్న రహదారి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 6న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ అందుకుంటారని కాలనీవాసులు తెలిపారు. తిరుమలనగర్‌కు ఆర్‌డబ్ల్యూఏ కేటగిరీలో స్వచ్ఛకాలనీగా ఎంపిక చేశారు. 2001లో ఆవిర్భవించిన తిరుమలనగర్‌లో నివాసులు 2005లో సంఘంగా ఏర్పడి పలు స్వచ్ఛంద సేవల ద్వారా కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటున్నారు. అందుకే కాలనీ ఇప్పటికే చాలా అవార్డులను సొంతం చేసుకుంది. తాజాగా రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికవడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో అప్పన్నకు అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేసి, ఉభయదాతలకు ప్రసాదం అందించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు.

జోనల్ కార్యాలయానికి హౌసింగ్ స్థలం కేటాయించాలి

అగనంపూడి: అగనంపూడి జోన్-9 కార్యాలయం ఏర్పాటుకు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సబ్‌నిర్మితి కేంద్రం(హౌసింగ్ బోర్డు) స్థలం కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తాత్కాలికంగా అగనంపూడిలోని రాజీవ్‌గాంధీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేయాలని భావించారని, శాశ్వత ప్రాతిపదిక భవన నిర్మాణానికి సబ్‌నిర్మితి కేంద్రం ఉన్న స్థలమే సరైనదని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మొల్లి కోటేశ్వరరావు, శీరంశెట్టి బాబ్జి, సింగిడి సింహాచలం వివరించారు.